


> భారత్-పాక్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం నేపథ్యంలో కేంద్రం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి. సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొంటారని కేంద్రం హామీ ఇవ్వకపోతే అన్ని పార్టీలు ఆ సమావేశానికి దూరంగా ఉండాలి. కేంద్రం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు కూడా నిర్వహించాలి.
>
> - కపిల్ సిబల్, రాజ్యసభ ఎంపీ

## పాక్ ఉల్లంఘిస్తే ఉపేక్షించొద్దు

**కమాండర్లకు పూర్తి అధికారాలు**

**పరిస్థితులపై సమీక్షించిన ఆర్మీ చీఫ్**

ఢిల్లీ, మే 11: డీజీఎంవో స్థాయిలో జరిగిన కాల్పుల విరమణ అవగాహనను పాక్ ఉల్లంఘిస్తే ఉపేక్షించవద్దని, కౌంటర్ ఎటాక్ చేయాలని ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది కమాండర్లకు ఆదేశాలు జారీచేశారు. ఈ విషయంలో వారికి పూర్తి అధికారాలు ఇచ్చారు. కాల్పుల విరమణకు ఇరుపక్షాల మధ్య అవగాహన కుదిరిన తర్వాత కూడా శనివారం రాత్రి పాక్ గగనతల ఉల్లంఘనలకు పాల్పడిన నేపథ్యంలో కమాండర్ స్థాయి అధికారులతో ఆర్మీ చీఫ్ భేటీ అయ్యారు. పశ్చిమ సరిహద్దులో పరిస్థితులపై సమీక్షించారు. ఈ మేరకు భారత ఆర్మీ 'ఎక్స్'లో పోస్ట్ చేసింది.

## ఆపరేషన్ సిందూర్ కొనసాగుతోంది

**మాకు అప్పగించిన పనిని అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేశాం: ఐఏఎఫ్**

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ కొనసాగుతున్నదని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) ఆదివారం ప్రకటించింది. తమకు అప్పగించిన లక్ష్యాన్ని అత్యంత కచ్చితత్వంతో జాతి ఉద్దేశాలకు అనుగుణంగా విజయవంతంగా నిర్వహిస్తున్నట్టు తెలిపింది. 'ఆపరేషన్స్ కొనసాగుతున్నందున పూర్తి వివరాలు సరైన సమయంలో పూర్తిగా వెల్లడిస్తాం. ధ్రువీకరించని సమాచారాన్ని, వదంతులను నమ్మొద్దు' అని తన ప్రకటనలో తెలిపింది. భారత్-పాక్ శనివారం కాల్పుల విరమణకు అంగీకరించిన తర్వాత ఈ ప్రకటన వెలువడటం గమనార్హం.



సురేంద్రసింగ్ | దీపక్

## ఇద్దరు జవాన్ల వీరమరణం

**పాక్ డ్రోన్ శకలాలు పడి ఒకరు..**

**ఎదురుకాల్పుల్లో మరొకరు మృతి**

న్యూఢిల్లీ: జమ్ము కశ్మీర్ ఉధంపూర్ జిల్లాలోని వైమానిక స్థావరంపైకి శనివారం పాక్ ప్రయోగించిన డ్రోన్‌ను భారత సైన్యం కూల్చివేసింది. అయితే ఆ డ్రోన్ శకలాలు పడి ఒకరు, సరిహద్దు వద్ద జరిగిన ఎదురు కాల్పుల్లో మరో జవాన్ మృతి చెందారు. వైమానిక స్థావరం వద్ద విధులు నిర్వహిస్తున్న ఓ భారత జవాన్‌కు శకలాలు తగలడంతో.. ఆయన తీవ్ర గాయాలతో మృతి చెందాడు. వీర మరణం పొందిన ఆ జవానును రాజస్థాన్‌కు చెందిన సురేంద్ర సింగ్ మోగాగా గుర్తించారు. ఆయన మృతికి రాజస్థాన్ సీఎం భజన్‌లాల్ శర్మ ఎక్స్‌లో సంతాపం వ్యక్తం చేశారు.


**గాయాలతో బీఎస్ఎఫ్ జవాన్ మృతి**


జమ్ము రీజియన్ సరిహద్దులో జరిగిన ఎదురుకాల్పుల్లో బీఎస్ఎఫ్ జవాన్ ఒకరు మృతి చెందారు. జమ్ము జిల్లాలోని ఆర్ఎస్ పుర ప్రాంతంలోని అంతర్జాతీయ సరిహద్దు వద్ద శనివారం పాకిస్థాన్ జరిపిన ఎదురుకాల్పుల్లో కానిస్టేబుల్ దీపక్ తీవ్రంగా గాయపడ్డారు. ఆయన చికిత్స పొందుతూ ఆదివారం మరణించినట్టు అధికారులు ప్రకటించారు.

## పీవోకేను ఆక్రమించకుండా శాంతిచర్చలా?

**సీపీఐ నేత కే నారాయణ**

హైదరాబాద్, మే 11 (నమస్తేతెలంగాణ) : పాక్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే) ఆక్రమించకుండా శాంతిచర్చలకు ఎందుకు వెళ్లారు? అని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గతంలో యుద్ధం విరమించాలని తాను సూచిస్తే నారాయణను పాకిస్థాన్‌కు పంపాలని బీజేపీ నాయకులు అవాకులు, చెవాకులు మాట్లాడారని, ఇప్పుడు ప్రధాని మోదీని పాకిస్థాన్‌కు పంపాలా? అని నిలదీశారు. ఈ మేరకు ఆదివారం ఎక్స్‌లో ఓ వీడియో విడుదల చేశారు. ఉగ్రవాదులు ఎప్పటికైనా ప్రమాదకరమేనని, ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు తగిన ఏర్పాట్లు చేయాల్సిందేనని స్పష్టంచేశారు. భారత్-పాకిస్థాన్ మధ్య యుద్ధ విరమణ, శాంతి చర్చలను సీపీఐ స్వాగతిస్తున్నట్టు తెలిపారు. పాక్‌పై యుద్ధానికి సీపీఐ వ్యతిరేకమని తేల్చి చెప్పారు. ఉగ్రవాదులపై దాడి చేయమని చెప్పినదానికి మమ్మల్ని అపార్థం చేసుకుంటారా? అని ప్రశ్నించారు. బీజేపీ నేతల వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు చెప్పారు.




భారత వాయుసేన జరిపిన దాడుల్లో ధ్వంసమైన పాకిస్థాన్ ఎయిర్‌బేస్‌లకు సంబంధించి భారత సంస్థ కవాస్పేస్ విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు

# లక్ష్యాన్ని ఛేదించాం!

మొదటిపేజీ తరువాయి...

డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్ ఏకే భార్తి, డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావల్ ఆపరేషన్స్ ఏఎన్ ప్రమోద్‌తో కలిసి రాజీవ్ ఘాయ్ మీడియా సమావేశం నిర్వహించారు. దాడులకు ముందు, దాడులకు తర్వాత పరిస్థితులను వివరించే ఫొటోలు, వీడియోలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా రాజీవ్ ఘాయ్ మాట్లాడుతూ.. 'ఏప్రిల్ 22న పహల్గాంలో ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది ప్రాణాలను బలిగొన్నారు. ఆ భయానక, క్రూరమైన దృశ్యాలను చూసి దేశం మొత్తం చలించిపోయింది. ఈ ఘటనతోపాటు మన సైన్యంపై, పౌరులపై గతంలో జరిగిన ఉగ్రదాడులు కూడా కలిపి చూస్తే.. ఒక దేశంగా మనం గట్టి సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైంది' అని పేర్కొన్నారు. అందుకే ఆపరేషన్ సిందూర్ ప్రారంభమైనట్టు తెలిపారు. ఉగ్రవాదులతోపాటు వారికి శిక్షణ ఇస్తున్నవారికి, ఉగ్రవాద సంస్థలను శిక్షించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ఇందుకోసం అత్యంత సూక్ష్మస్థాయిలో విశ్లేషించి లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకున్నామని చెప్పారు. పాకిస్థాన్, పీవోకేలో అనేక ఉగ్ర స్థావరాలను గుర్తించగా, అందులో ఇప్పటికీ కార్యకలాపాలు కొనసాగుతున్న వాటిని మాత్రమే లక్ష్యంగా ఎంచుకున్నామన్నారు. ఈ నెల 7న దాడులు చేసి 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వసం చేశామని చెప్పారు. ఇందులో మురిద్కేలోని లష్కరే తాయిబా ప్రధాన కేంద్రం వంటివి ఉన్నాయన్నారు. ఇందులోనే ఏండ్లుగా ఉగ్రవాదులకు శిక్షణ ఇస్తున్నారన్నారు. అజ్మల్ కసబ్, డేవిడ్ హెడ్లీ వంటి వారు ఇక్కడే శిక్షణ పొందారన్నారు. సైన్యం దాడుల్లో యూసుఫ్ అజర్, అబ్దుల్ మాలిక్ రవూఫ్, ముదసిర్ అహ్మద్ వంటి మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదులను అంతమొందించినట్టు చెప్పారు. ఐసీ 814 విమానం హైజాక్, పుల్వామా దాడుల్లో పాలుపంచుకున్న ఉగ్రవాదులను ఏరివేశామన్నారు.

### 35-40 మంది పాక్ సైనికులు మృతి

భారత్ సైన్యం పోరాటం తీవ్రవాదులపైనే తప్ప పాకిస్థాన్ సైన్యంపై కాదని, అందుకే రక్షణాత్మక వైఖరిని అవలంబించామని చెప్పారు. అయితే.. 'దేశ సమగ్రత, సార్వభౌమాధికారం, పౌరుల భద్రతకు ముప్పు కలిగిస్తే ఎవరినీ సహించేది లేదు' అని స్పష్టం చేశారు. పాకిస్థాన్ పదేపదే దాడులు చేస్తూ, తమకు ప్రతిదాడి చేయడం మినహా మరో మార్గం లేకుండా చేసిందన్నారు. అందుకే పరిమిత సంఖ్యలో, ఎక్కువ నష్టం కలిగించే చోట్ల దాడులు చేయాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. మలిర్ కంటోన్మెంట్‌లోని సర్ఫేస్ టు ఎయిర్ మిస్సైల్ (ఎస్ఏఎం) సిస్టమ్స్, లాహోర్, గుజ్రాన్‌వాలా సమీపంలోని సర్వేలైన్స్ రాడార్ కేంద్రాలు, మురిద్, చక్లాలా, రహీయార్ ఖాన్, సుక్కుర్‌లోని ఎయిర్ బేస్‌లపై దాడులు చేశామన్నారు. 'మా వైమానిక దాడులతో పాకిస్థాన్ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదన్న గట్టి సంకేతాలు పంపించాం' అని స్పష్టం చేశారు. భారత సైన్యం జరిపిన ప్రతిదాడుల్లో 35-40 మంది పాకిస్థాన్ సైనికులు మరణించినట్టు చెప్పారు. భారత సైన్యం దాడులతో పాకిస్థాన్ సైన్యానికి భారీ నష్టం వాటిల్లిందని చెప్పారు. పాక్‌కు చెందిన కీలక ఆర్మీ స్థావరాలను ధ్వంసం చేశామని, రాజధాని లాహోర్‌కు సమీపంలోని స్థావరాలకు కూడా నష్టం కలిగించామన్నారు. పాక్‌కు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాలను కూల్చేశామని ప్రకటించారు. పాకిస్థాన్ సైన్యం భారత భూభాగంలోకి అడుగు పెట్టలేదని, భారత సైన్యం వారికి ఆ అవకాశం ఇవ్వలేదని స్పష్టం చేశారు.

**స్పష్టమైన లక్ష్యంతో దాడులు చేశాం**

భారత వాయుసేన యుద్ధవిమానాలు స్పష్టమైన లక్ష్యంతో ఉగ్రవాద శిబిరాలపై దాడులు చేశామని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఎయిర్ ఆపరేషన్స్ ఏకే భార్తి తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వాయుసేన పాత్రను వివరించారు. బహావల్పూర్, మురిద్కేలో జరిపిన దాడుల్లో ఫైటర్ జెట్లు పాల్గొన్నాయన్నారు. 'ఉగ్రవాద సంస్థల నిర్మాణాలు మాత్రమే మా లక్ష్యం. పాకిస్థాన్ మిలిటరీ కాదు' అని స్పష్టం చేశారు. అందుకే లక్ష్యాలను కచ్చితంగా ఛేదించే ప్రిసిషన్ ఎయిర్ మ్యునిషన్స్ (పీపీఎం)లను ప్రయోగించామన్నారు. ఈ నెల 7వ తేదీన పాకిస్థాన్‌కు చెందిన యూఏవీలు, డ్రోన్లు వరదలా భారత భూభాగంలోకి చొచ్చుకొని వచ్చాయని, మిలిటరీ ప్రాంతాలు, జనావాసాలపై దాడికి ప్రయత్నించాయని చెప్పారు. సైన్యం వేగంగా స్పందించి వాటిని కూల్చివేసిందన్నారు. 8, 9 తేదీల్లో పాకిస్థాన్ మరోసారి సరిహద్దు వెంబడి డ్రోన్లను ప్రయోగించిందని, భారత సైన్యం వాటిల్లో అత్యధిక శాతం డ్రోన్లను గాలిలోనే పేల్చివేసిందన్నారు. అంతేకాకుండా పాకిస్థాన్‌కు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాలను కూల్చేశామన్నారు. 'పాక్ విమానాలు భారత సరిహద్దులోకి రాకుండా అడ్డుకున్నాం. కొన్ని విమానాలను సరిహద్దు దాటకముందే కూల్చేశాం. కాబట్టి మా దగ్గర శిథిలాలు లేవు. అయితే.. ఎన్ని జెట్లను కూల్చామో నాకు తెలుసు. కానీ వివరాలు బయటికి వెల్లడించం' అని పేర్కొన్నారు. భారత్‌కు చెందిన ఫైటర్ జెట్లను పాక్ కూల్చేసిందంటూ విదేశీ మీడియాలో వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. భారత పైలట్లు అందరూ సురక్షితంగా తిరిగి వచ్చారన్నారు. 'మనం యుద్ధ పరిస్థితుల్లో ఉన్నాం. నష్టం ఇరువైపులా ఉంటుంది. కానీ మేం మా లక్ష్యాలను సాధించాం. మా పైలట్లు సురక్షితంగా తిరిగి వచ్చారు' అని పేర్కొన్నారు.

### దిగివచ్చిన పాక్..

భారత త్రివిధ దళాలు జరిపిన దాడుల ఫలితంగా శనివారం మధ్యాహ్నం పాకిస్థాన్ దిగివచ్చిందని చెప్పారు. తనకు హాట్‌లైన్‌లో పాకిస్థాన్ డీజీఎంవో నుంచి సందేశం వచ్చిందన్నారు. దాడులను ఆపాలని, చర్చించుకునే మార్గాలు అన్వేషించాలని ప్రతిపాదించారన్నారు. అయితే.. కాల్పుల విరమణ ప్రకటన తర్వాత కూడా ఈ నెల శనివారం రాత్రి, సోమవారం తెల్లవారుజామున పాకిస్థాన్ సైన్యం సరిహద్దు వెంబడి దాడులు చేసిందని చెప్పారు. దీంతో తాము హాట్‌లైన్‌లో మరోసారి పాకిస్థాన్‌తో మాట్లాడామని, ఉల్లంఘనల పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశామన్నారు. 'మరోసారి కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే తీవ్ర స్థాయిలో ప్రతిస్పందన ఉంటుంది' అని హెచ్చరించినట్టు చెప్పారు. సోమవారం రెండు దేశాల మధ్య డీజీఎంవోల స్థాయి సమావేశం జరుగనున్నదని, కాల్పుల విరమణ తదితర అంశాలపై చర్చిస్తామని చెప్పారు. మళ్లీ కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే పాక్ భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

**నావికాదళం.. సర్వ సన్నద్ధం**

డైరెక్టర్ జనరల్ ఆఫ్ నావల్ ఆపరేషన్స్, వైస్ అడ్మిరల్ ఏఎన్ ప్రమోద్ మాట్లాడుతూ.. పహల్గాం దాడి తర్వాత భారత నావికాదళం అరేబియా సముద్రంలో అనేక మిస్సైళ్లను ప్రయోగించిందని చెప్పారు. దీంతో పాకిస్థాన్ నేవీ డిఫెన్స్‌లో పడిపోయిందన్నారు. ఎలాంటి ఆపరేషన్లు చేపట్టడానికైనా భారత నావికాదళం సర్వసన్నద్ధంగా ఉన్నదన్నారు. 'ఎయిర్‌ఫోర్స్, నేవీ, ఆర్మీ సంయుక్తంగా జరిపిన ఆపరేషన్ల ఫలితంగా పాకిస్థాన్ డీజీఎంవో దిగివచ్చి, చర్చలకు ప్రతిపాదించారు' అని ప్రకటించారు.

## అప్పుడే ఇండ్లకు రావొద్దు

**సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్ముకశ్మీర్ పోలీసుల సూచన**

**కాల్పుల విరమణతో సరిహద్దు రాష్ట్రాల్లో సాధారణ పరిస్థితులు**

శ్రీనగర్, మే 11: సరిహద్దు గ్రామాల ప్రజలు అప్పుడే ఇండ్లకు తిరిగి రావొద్దని, సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని జమ్ముకశ్మీర్ పోలీసులు అడ్వైజరీ జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత పాకిస్థాన్ డ్రోన్ దాడులు, కాల్పులకు తెగబడటంతో నియంత్రణ రేఖ వెంబడి బారాముల్లా, బందిపొర, కుప్వారా జిల్లాల్లోని 1.25 లక్షల కంటే ఎక్కువ మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. దాడులకు తెగబడిన సమయంలో పాక్ ప్రయోగించిన మిస్సైల్స్, పేలుడు అవశేషాలను తొలగించాల్సి ఉందని పేర్కొన్నారు. ముందుగా బాంబు నిర్వీర్య బృందాలను ఆయా గ్రామాలకు పంపి ప్రజల ప్రాణాలకు నష్టం కలిగించే పేలుడు పదార్థాలు, ఫిరంగి గుండ్లను తొలగిస్తామని వెల్లడించారు. 2023లో నియంత్రణ రేఖ వెంబడి ఇలా మిగిలిపోయిన షెల్స్ వల్ల 41 మంది ప్రాణాలు కోల్పోయారని పోలీసులు గుర్తు చేశారు.

**సరిహద్దు రాష్ట్రాలు ప్రశాంతం..**

కాల్పుల మోతలు.. ఫిరంగుల శబ్దాలు.. డ్రోన్ల చప్పుళ్లతో దద్దరిల్లిన నియంత్రణ రేఖ శాంతించింది. సరిహద్దు రాష్ట్రాలైన జమ్ముకశ్మీర్, పంజాబ్, రాజస్థాన్, గుజరాత్‌లో ఆదివారం ప్రశాంత వాతావరణం కనిపించింది. ఏ క్షణాన ఏం జరుగుతుందోనని ఆందోళన చెందిన సరిహద్దు గ్రామాల ప్రజలకు ఉపశమనం లభించింది. కాల్పుల విరమణ ప్రకటన వెలవడిన తర్వాత కూడా శనివారం రాత్రి కొద్ది గంటల పాటు జమ్ముకశ్మీర్‌లో పాకిస్థాన్ ఉల్లంఘనలకు పాల్పడుతూ డ్రోన్లను ఎగరేసినప్పటికీ తెల్లవారేసరికి అంతటా ప్రశాంతంగానే ఉందని పోలీసు అధికారులు తెలిపారు.

# మూడో దేశం జోక్యం ఏమిటి?

- **ఇది బీజేపీ ప్రభుత్వం చేతకానితనమే**
- **సిమ్లా ఒప్పందాన్ని కేంద్రం వదిలేసిందా?**
- **వెంటనే అఖిలపక్ష భేటీ, పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించాలి**
- **మోదీ సర్కారుపై ప్రతిపక్షాల ఒత్తిడి**





న్యూఢిల్లీ, మే 11: భారత్, పాకిస్థాన్ మధ్య మధ్యవర్తిత్వం చేస్తామంటూ అమెరికా ప్రకటించడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికార బీజేపీని నిలదీశాయి. హఠాత్తుగా పాక్‌తో యుద్ధానికి స్వస్తి పలికి కాల్పుల విరమణ ప్రకటించడానికి కారణమేమిటో చెప్పాలంటూ డిమాండ్ చేశాయి. ఇరు దేశాల సమస్యలపై ద్వైపాక్షికంగానే చర్చలు జరపాలంటూ గతంలో కుదుర్చుకున్న సిమ్లా ఒప్పందాన్ని మోదీ ప్రభుత్వం వదిలేసిందా? మూడో దేశం జోక్యానికి తలుపులు తెరిచిందా? అని ప్రశ్నించాయి. యుద్ధానికి సంబంధించి కాల్పుల విరమణ తాము చేసిన కృషే అంటూ శనివారం అమెరికా ప్రకటించడం, ఒక తటస్థ వేదికపై కలుసుకుని భారత్-పాకిస్థాన్ చర్చలు జరుపుతాయంటూ అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో ప్రకటించడం, కశ్మీర్ వివాద పరిష్కారానికి తాను భారత్, పాకిస్థాన్‌తో కలిసి పనిచేస్తానంటూ ఆదివారం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనను విపక్షాలు తీవ్రంగా పరిగణించాయి.

**వెంటనే పార్లమెంట్‌ను సమావేశ పర్చాలి**

పహల్గాం ఘటన, ఆపరేషన్ సిందూర్‌లకు సంబంధించి పూర్తి స్థాయిలో చర్చలు జరిపేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని తాము డిమాండ్ చేస్తున్నట్టు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ తెలిపారు. కాల్పుల విరమణపై వాషింగ్టన్ తొలి ప్రకటన చేయడం, తర్వాతే భారత్, పాకిస్థాన్‌లు స్పందించడం తదితర విషయాలను కూలంకషంగా చర్చించాలన్నారు. కాగా, ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ విపక్ష నేతలు మల్లికార్జున ఖర్గే (రాజ్యసభ), రాహుల్ గాంధీ (లోక్‌సభ) ప్రధాని నరేంద్ర మోదీకి లేఖలు రాశారు. భారత్, పాక్ మధ్య చర్చలకు తటస్థ వేదిక అంశాన్ని యూఎస్ విదేశాంగ కార్యదర్శి ప్రస్తావించడాన్ని కాంగ్రెస్ గుర్తు చేస్తూ ఆయన చేసిన ప్రకటన పలు ప్రశ్నలు, అనుమానాలను రేకెత్తిస్తున్నదని పేర్కొంది. 'అంటే మనం సిమ్లా ఒప్పందాన్ని విడిచిపెట్టేసినట్టేనా? ఈ రెండు దేశాల వివాదంలో మూడో దేశం మధ్యవర్తిత్వానికి తలుపులు బార్లా తెరిచినట్టేనా?' అని జైరామ్ రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. సిమ్లా ఒప్పందం ప్రకారం రెండు దేశాల మధ్య ఉన్న ఎలాంటి సమస్యలనైనా ద్వైపాక్షికంగానే పరిష్కరించుకోవాలని, అందులో మూడో దేశం ప్రమేయం, జోక్యం ఎంతమాత్రం ఉండరాదన్న విషయాన్ని గుర్తు చేశారు. భారత్, పాక్ మధ్య దౌత్య మార్గాలు తిరిగి తెరుస్తున్నారా? ఇస్లామాబాద్ నుంచి భారత్ ఏవిధమైన నిబద్ధతలను పొందింది? వేటిని కోరింది? అని ఆయన ప్రశ్నించారు.

### దేశానికే అవమానం



**మోదీ** చర్య దేశానికే పెద్ద అవమానమని శివసేన యూబీటీ నేత సంజయ్ రౌత్ వ్యాఖ్యానించారు. మీకే కనుక ధైర్యం ఉంటే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని, దానికి ప్రధాని మోదీ కచ్చితంగా హాజరు కావాలని ఆయన డిమాండ్ చేశారు. ట్రంప్ జోక్యం కారణంగా యుద్ధాన్ని ఆపేసినట్టు ప్రభుత్వం చెబుతున్నదని, అలాంటప్పుడు ఎన్నాళ్ల నుంచో జరుగుతున్న ఇజ్రాయెల్-గాజా యుద్ధాన్ని ట్రంప్ ఎందుకు ఆపలేదని ఆయన ప్రశ్నించారు. ట్రంప్ జోక్యం మన దేశ సార్వభౌమత్వంపై దాడేనని, ఇది మన ప్రభుత్వ బలహీనతను చూపుతున్నదని ఆయన అన్నారు. రెండు దేశాల మధ్య వివాదంలో మూడో దేశం జోక్యం సహించరానిదని ఆర్జేడీ ఎంపీ మనోజ్ కె ఝా అన్నారు. ప్రాంతీయ వివాదంలో బాహ్యశక్తుల జోక్యాన్ని ఎంతమాత్రం సహించకూడదని ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జీ దేవరాజన్ పేర్కొన్నారు.



సరిహద్దు రాష్ట్రాల నుంచి ఢిల్లీలో తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్న తెలంగాణ వాసులు

## తెలంగాణ భవన్‌కు సరిహద్దు ప్రజలు

**ఉద్రిక్త వాతావరణం నుంచి సురక్షిత ప్రదేశాలకు తరలిన ప్రజలు**

**భోజన, వైద్య, రవాణా ఏర్పాట్లు చేసిన భవన్ అధికారులు**

న్యూఢిల్లీ, మే 11 (నమస్తే తెలంగాణ): భారత్-పాకిస్థాన్ మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాల్లో నివసిస్తున్న తెలంగాణకు చెందిన విద్యార్థులు, పౌరులు పెద్దసంఖ్యలో ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకుంటున్నారు. ఇప్పటివరకు 180 మంది తెలంగాణవాసులు భవన్‌కు చేరుకున్నారు. వీరికి భోజన, వసతి, రవాణా ఏర్పాట్లు చేస్తున్నట్టు భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ తెలిపారు. ఇప్పటికే 26 మందిని రవాణా సౌకర్యాలు కల్పించి, స్వగ్రామాలకు పంపించినట్టు గౌరవ్ ఉప్పల్ చెప్పారు. తెలంగాణ భవన్‌కు చేరుకున్న ప్రతి ఒక్కరికీ సాయం అందిస్తామని స్పష్టంచేశారు.

## కశ్మీర్ సమస్య పరిష్కారానికి కృషి



- **భారత్-పాక్‌తో కలిసి పనిచేస్తాం**
- **ఉద్రిక్తతలు కొనసాగితే లక్షల మంది ప్రాణాలు పోయేవి**
- **చారిత్రక, వీరోచిత నిర్ణయంలో అమెరికా భాగమైంది: ట్రంప్**

న్యూఢిల్లీ: కశ్మీర్ సమస్య పరిష్కారానికి భారత్, పాకిస్థాన్ దేశాలతో కలిసి పనిచేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. దాయాది దేశాల మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ కాల్పుల విరమణకు సయోధ్య కుదిర్చామని శనివారం ప్రకటించిన ట్రంప్.. ఇప్పుడు కశ్మీర్ సమస్య పరిష్కారానికి ఇరు దేశాలతో కలిసి పనిచేస్తామని చెప్పారు. తన సొంత సోషల్ మీడియా వేదిక 'ట్రూత్' ద్వారా ఆయనీ విషయాన్ని వెల్లడించారు. 'వేయి సంవత్సరాల తర్వాత కశ్మీర్ సమస్యకు ఒక పరిష్కారం లభిస్తుందేమో చూసేందుకు మీ ఇద్దరితో కలిసి పనిచేస్తాను. గొప్ప పని చేసినందుకు భారత్, పాక్ నాయకత్వాలకు దేవుడి ఆశీస్సులు ఉండాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే లక్షలమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయి ఉండేవారని, ఇరు దేశాల నేతలు తెలివైన నిర్ణయం తీసుకున్నారని ప్రశంసించారు. దేశానికి సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే నేషనల్ కమాండ్ అథారిటీతో సమావేశానికి పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ సిద్ధమైన నేపథ్యంలో ట్రంప్ ఈ ప్రకటన చేయడం గమనార్హం. అయితే, పాక్ రక్షణ మంత్రి ఖావాజా అసిఫ్ మాత్రం ఇలాంటి సమావేశమేదీ జరగలేదని తేల్చి చెప్పారు. భారత్, పాకిస్థాన్ దేశాలు బలమైన, అచంచల నాయకత్వ పటిమకు తాను గర్విస్తున్నానని, ఎంతోమంది మరణానికి, విధ్వంసానికి దారితీసే ప్రస్తుత దూకుడుకు ఫుల్‌స్టాప్ పెట్టాల్సిన సమయం ఇదేనని ఇరు దేశాలు గ్రహించాయని అన్నారు. 'మీ ధైర్యవంతమైన చర్యలతో మీ వారసత్వం ఎంతగానో పెరిగింది. చారిత్రక, వీరోచిత నిర్ణయానికి అమెరికా సాయం చేసినందుకు గర్వంగా ఉంది' అని ట్రంప్ వివరించారు.

**ట్రంప్ ఆఫర్‌ను స్వాగతించిన పాక్**

కశ్మీర్ సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం వహిస్తానన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతిపాదనను పాకిస్థాన్ స్వాగతించింది. దక్షిణాసియా, దాని ఆవల శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలిగిస్తున్న దీర్ఘకాల సమస్య అయిన జమ్ముకశ్మీర్ వివాద పరిష్కారానికి ట్రంప్ తన సంసిద్ధతను వ్యక్తం చేయడాన్ని తాము అభినందిస్తున్నట్టు పేర్కొంది. జమ్ముకశ్మీర్ వివాదానికి న్యాయమైన, శాశ్వత పరిష్కారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి తీర్మానాలకు అనుగుణంగా ఉండాలని, కశ్మీరీ ప్రజల ప్రాథమిక హక్కులు, వారి స్వయం నిర్ణయాధికార హక్కును కూడా సాధించేలా చూడాలని పాక్ నొక్కి చెప్పింది. ప్రపంచ శాంతికి ట్రంప్ మార్గదర్శక నాయకత్వం, నిబద్ధత, దక్షిణాసియాకు శాశ్వత శాంతిని తీసుకురావడంలో గొప్ప పాత్ర పోషించాలనే ట్రంప్ అత్యంత విలువైన ప్రతిపాదనకు కృతజ్ఞతలు తెలుపుకొంటున్నట్టు పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. 'దశాబ్దాలుగా పాక్, అమెరికా దేశాలు పరస్పర ప్రయోజనాలను రక్షించుకునేందుకు, ప్రపంచంలోని కీలక ప్రాంతాల్లో శాంతి, భద్రత కోసం భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌లో మా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని పునరుద్ధరించగల, పాకిస్థాన్-యూఎస్ సంబంధాలను బలోపేతం చేయగల గొప్ప భాగస్వామిని పాక్ కనుగొంది. వాణిజ్యం, పెట్టుబడిలో మాత్రమే కాకుండా సహకారానికి సంబంధించి అన్ని రంగాల్లో కూడా' అని షెహబాజ్ ట్వీట్ చేశారు.

# మోదీ సర్కారు దిద్దుబాటు చర్యలు



కేంద్రమంత్రులు రాజ్‌నాథ్, జైశంకర్, త్రివిధ దళాధిపతులతో మోదీ సమీక్ష

- **కాల్పుల విరమణపై విమర్శలతో డ్యామేజ్ కంట్రోల్‌కు తంటాలు!**
- **మధ్యవర్తిత్వం అవసరం లేదని, పీవోకేపై మాత్రమే చర్చిస్తామని అనుకూల మీడియాకు లీకులు!**

ఢిల్లీ, మే 11: పాక్‌పై భారత్ చివరి వరకు పైచెయ్యిలో నిలిచినా.. అనూహ్యంగా మోదీ సర్కారు కాల్పుల విరమణకు అంగీకరించడంపై విమర్శలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ సర్కారు దిద్దుబాటు చర్యలకు దిగింది. ఆదివారం ప్రధాని మోదీ త్రివిధ దళాధిపతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా.. పాక్ కాల్పుల విరమణను ఉల్లంఘించి, మళ్లీ కవ్వింపులకు దిగితే తీవ్రంగా స్పందించాలని ఆర్మీ అధికారులకు మోదీ సూచించినట్టు అనుకూల మీడియాకు లీకులు ఇచ్చారు. వాళ్లు తూటా పేల్చితే ఫిరంగులతో సమాధానం ఇవ్వాలని సూచిం చినట్టు చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని ఏ ప్రాంతం కూడా సురక్షితం కాదని టెర్రరిస్టులకు స్పష్టమైన సంకేతం ఇచ్చామని మోదీ చెప్పినట్టు వార్తలు వచ్చాయి. ఇదంతా దిద్దుబాటు చర్యల్లో భాగమేనని విశ్లేషకులు విమర్శిస్తున్నారు. అమెరికా మధ్యవర్తిత్వంతో కాల్పుల విరమణకు అంగీకరించడంపై వెల్లు వెత్తుతున్న విమర్శలను అడ్డుకునేందుకు సైతం తంటాలు పడినటట్టు స్పష్టం అవుతున్నది. 'కశ్మీర్ విషయంలో భారత్‌కు స్పష్టమైన వైఖరి ఉంది. పీవోకేను భారత్‌కు తిరిగి ఇవ్వడం తప్ప మరో అంశం గురించి చర్చ అవసరం లేదు. ఉగ్రవాదులను అప్పగించడంపై వారు మాట్లాడితే, చర్చించేందుకు మేం సిద్ధం. ఇది తప్ప మరో అంశం గురించి మాట్లాడే ఉద్దేశం లేదు. ఎవరి మధ్యవర్తిత్వాన్నీ మేం కోరుకోవడం లేదు' అని మోదీ చెప్పినట్టు బీజేపీ అనుకూల మీడియా, సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. దీంతో మోదీ సర్కారుపై విమర్శలు మరోసారి వెల్లువెత్తుతున్నాయి. అమెరికా ఒత్తిడికి తలొగ్గి, కాల్పుల విరమణకు అంగీకరించి ఇప్పుడు దిద్దుబాటు చర్యలకు దిగిందని పలువురు పేర్కొంటున్నారు. ఇరుదేశాల అంశంలోకి మూడో పక్షాన్ని తీసుకొచ్చినట్టు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. షరతులు లేకుండా సీజ్‌ఫైర్‌కు అంగీకరించి, ఇప్పుడు పీవోకేపైనే చర్చిస్తామని చెప్పడంలో ఆంతర్యమేంటని నిలదీస్తున్నారు. ఉగ్రవాదంపై పోరు మొదలుపెట్టి, ఆ సమస్యను పూర్తిగా పరిష్కరించుకోకుండానే, వెనకడుగు ఎందుకు వేయాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. కాల్పుల విరమణకు అంగీకరించాక పీవోకేపై చర్చలంటే పాక్ లొంగుతుందా? అని నిలదీస్తున్నారు.

## కాల్పుల విరమణ మా విజయం: షెహబాజ్

న్యూఢిల్లీ: భారత్‌తో కాల్పుల విరమణ ఒప్పందం తమ దేశం సాధించిన చారిత్రక విజయమని పాకిస్థాన్ ప్రధానమంత్రి షాబాజ్ షరీఫ్ చెప్పుకున్నారు. భారత్ దూకుడుకు సైన్యం 'ప్రొఫెషనల్'గా, 'ఎఫెక్టివ్'గా స్పందించిందని పేర్కొన్నారు. తమ దేశంపై దాడికి పహల్గాం దాడిని భారత్ సాకుగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. తమ చర్యలు ద్వేషం, దూకుడు, మత ఛాందసవాదానికి వ్యతిరేకంగానేనని స్పష్టం చేశారు. ఇది తమ సిద్ధాంతాలు, గౌరవం సాధించిన విజయమని చెప్పుకొచ్చారు. ఈ విజయం సాయుధ దళాలది మాత్రమే కాదని, దేశం మొత్తానిదని పేర్కొన్నారు. శత్రుదేశానికి అర్థమైన భాషలోనే సమాధానం చెప్పాలని ముందే నిర్ణయించుకున్నామని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పాక్ ఆత్మగౌరవం, నిజాయతీ గల దేశమని చెప్పేందుకు కాల్పుల విరమణ ఒక ఉదాహరణ అని షాబాజ్ పేర్కొన్నారు.